# కాంప్లెక్స్ కథలు

# పండితశిఖామణి కాంప్లెక్స్

డా॥ సి. ఆనందారామం



పండిత శిఖామణినని చెప్పుకొనే అల్లుణ్ణి పాతకాలం అత్తగారు ఒక ఉత్తరం చదివి పెట్టమంది. ఉత్తరం చూసి అల్లుడు ఏడుపు మొదలు పెట్టాడు. ఆ సమయంలో మావగారు వచ్చి ఉత్తరం చదివి, ఉత్తరంలో శుభవార్తకీ, ఇంట్లో ఏడుపులకీ పొంతన కుదరక అల్లుణ్ణి కారణం అడిగాడు. "నా చిన్నప్పుడు అంతంత ఉండే 'అ, ఆ,' లు ఇప్పుడు ఇంతంత అయిపోయాయని ఏడుస్తున్నా" అన్నాడు వెక్కుతూ ఆ పండిత శిఖామణి.

ఇది అసలు విషయం తెలియక పోయినా ఆర్భాటం చేసే పండిత శిఖామణి కాంప్లెక్స్.

* * *

గంగా భాగీరథీ సమానురాలైన బుచ్చెమ్మగారు, అంతో ఇంతో చదువుకుని పురాణాలు చెప్పటంలో మంచి పేరు సంపాదించుకుంది. సైడ్ బిజినెస్‌గా అప్పడాలూ, వడియాలూ మొదలైనవి అమ్ముతూ

ఉంటుంది. పురాణాలు చెప్తూ బుచ్చెమ్మగారు రకరకాల హాస్య సంభాషణలు చేసి (ఔచిత్యం అవునా, కాదా, అని కూడా చూడకుండా) జనాన్ని నవ్వించేది. అంచేత ఆవిడ పురాణ కాలక్షేపాలకి జనం బాగానే పోగయ్యేవారు.

ఒకప్పుడు కవి పండితులను పోషించిన రాజవంశం సంతోష్ కుమార్‌ది. ఆనాటి రాచరికాలూ, జమిందారీలూ, అన్నీ పోయినా, గత వైభవాలకు చిహ్నంగా ఆయన పేరు చివర రాజా మాత్రం మిగిలే ఉంది. పాపం, ఆయన తనను తాను "కుమార్" అని పిలిపించుకోవాలని ఎంత ముచ్చట పడుతున్నా, జనం ఆయనను కుమార రాజా అని పిలవటం మానటంలేదు. ఆయన పాతకాలపు పద్ధతులన్నీ వది లేసి ఇంటా బయటా అన్నీ ఆధునిక పద్ధతులనే అనుసరిస్తున్నా, కవి పండితుల పట్ల మాత్రం తరతరాల నుండీ వస్తున్న గౌరవాన్ని అలాగే నిలుపుకొని, వీలయినంత వరకూ సానుభూతితో తగిన ప్రోత్సాహమిస్తూ ఉన్నారు. ఆయన అదృష్టవశాత్తు కలిగినింట్లో పుట్టినా, ఆయన చిన్నప్పటి నుండీ, బాగా చదువుకొని ప్రస్తుతం ప్రభుత్వాంగంలో ప్రముఖమైన స్థానంలో ఉన్నారు. పిత్రార్జితమైన భూములూ, ఇళ్ళూ, మంచి ఉద్యోగం, ఆర్థికంగా ఆయన చాలా ఉన్నత దశలో ఉన్నారు. తెల్లవారింది మొదలు ఆయనను అనేక అవసరాలకై ఆశ్రయించేవారు అనేకమంది. ఆయన సంగతి విని బుచ్చెమ్మగారు కూడా ఒకనాడు ఎలాగో ఆయనను ఆశ్రయించి తన పురాణ కాలక్షేపం ఏర్పాటు చేయించమని కోరింది. వితంతువు పైన జాలితో రాజావారు కాదనలేక, లంకంత తన భవనంలో అంతగా ఉపయోగం లేని ఒక వరండాలో పురాణ కాలక్షేపం ఏర్పాటు చేసారు. ఆవిడ ప్రతిరోజూ పురాణాలు చెపుతూ ఉండేది. తోచీ తోచని చుట్టు ప్రక్కల అమ్మలక్కలు కొందరువచ్చి, మధ్య మధ్యలో ముచ్చట లాడుకుంటూ ఆ పురాణాలు వినేవారు. ఈ మధ్య కాలంలో బుచ్చమ్మ గారికి ఏవో భూములకు సంబంధించిన దావాల చిక్కులు వచ్చాయి.

రాజాగారు దయతలిచి, తన పలుకుబడి ఉపయోగించి బుచ్చమ్మగారికి ఆ చిక్కులు పరిష్కరించి పెట్టారు. అక్కడితో ఆవిడ ఎంతో బడాయిగా "రాజావారికి నేనంటే ఎంతో గౌరవం. నేనేది అడిగితే అది చేస్తారు" అని ప్రచారం చేసుకోవటం ప్రారంభించింది. అంతే గాక ఆవిడ బంధువర్గంలో ఒకరిద్దరికి ఉద్యోగాలు దొరకక అవస్థపడు తూంటే, రాజాగారిని ప్రాధేయపడి వాళ్ళకి ఉద్యోగాలు వేయించింది. అక్కడితో ఈవిడ బడాయికి పట్టపగ్గాలు లేకుండా పోయాయి. "నాకు రాజావారి అండదండలున్నాయి. నా జోలికి ఎవరైనా వస్తే తగిన శాస్తి చేయిస్తారు" అని చెప్పుకోనటం ప్రారంభించింది. కొందరు నిజంగానే [illegible]. పురాణాలు వినేవాళ్ళూ, ఏవేవో ఉప కారాలు పొందినవాళ్ళూ, పొందాలని అనుకునేవాళ్ళూ-ఆవిడకి అను యాయులు చాలామందే ఉండేవారు. అలా అలా ఆవిడ కొంత ప్రసిద్ధురాలయింది.

తన పురాణాలు కుమారరాజా ఇంట్లో వారు ఎవ్వరూ వినక పోవటం బుచ్చెమ్మగారికి చాలా వెలితిగా తోచింది. ఒకటి రెండు సార్లు కుమారరాజాగారినే కాలక్షేపానికి రమ్మని ప్రార్థించింది. ఆయన గట్టిగా నవ్వి "అమ్మా! మీకే సహాయం కావాలన్నా చేస్తాను. కానీ మీ పురాణం వినటానికి మాత్రం నన్ను రమ్మని కోరకండి" అన్నారు. బుచ్చెమ్మగారు చిన్నపుచ్చుకుని "పోనీ, మీ యింటి ఆడ వారయినా...." అని నసిగింది. ఆయన మరోమారు గట్టిగా నవ్వి "మా ఇంటి ఆడవారిమీద నా అధికారం చెల్లదమ్మా! స్త్రీ స్వాతం త్ర్యం రోజులు! మీరే అడగండి!" అన్నారు.

ఆ రకంగా బుచ్చెమ్మగారు మొదటిసారిగా రాజావారి గృహాం తర్భాగంలోకి ప్రవేశించి, రాణీగారిని దర్శించుకుంది. అద్దం ముందు కూచుని అలంకరించుకుంటున్న రాణిగారినిచూసి, ఆ అందానికీ, అలంకారానికీ- బుచ్చెమ్మగారి కళ్ళు చెదిరిపోయాయి. పైనుంచి

క్రిందివరకూ బంగారు నగలు, జరీబుటాలు, మెరిసిపోతోన్న పట్టుచీర. కన్నార్పక చూస్తూ నిలబడ్డ బుచ్చేమ్మగారిని కన్నెత్తి చూడకుండా "కూచోండి!" అన్నారు రాణీగారు. బుచ్చేమ్మగారు అగ్గగ్గలాడుతూ కూచుని "రాణీగారూ...." అంటూ ఏదో చెప్పబోయారు.

"నేను రాణీగారిని కాను, నాకు రాజ్యాలూ లేవు. నన్ను మామూలుగా పిలవండి" అని ఆవిడ కస్సుమంది.

బుచ్చేమ్మగారు దెబ్బ తిని సర్దుకుని "అమ్మగారూ...." అంటూ ఏదో చెప్పబోయారు. ఆవిడ మళ్ళీ చిరాకుపడుతూ "అమ్మగారూ ఏమిటండీ, అమ్మవారులాగ! నేను మరి అంత పెద్దదానిలా కనిపిస్తున్నానా? మామూలుగా 'మిసెస్ కుమార్' అని పిలవండి" అంది స్టైయిల్‌గా ఒళ్ళు విరుచుకుంటూ.

బుచ్చేమ్మగారికి మతిపోయింది. కంగారుగా "మిసెస్ కుమారమ్మగారూ! తమరొకసారి నా పురాణ కాలక్షేపానికి రావాలి" అంది. మిసెస్ కుమార్ చికాగ్గా నొసలు చిట్లించి "పురాణ కాలక్షేపానికా? పరమబోర్! అయినా ప్రస్తుతం రాముడూ, భీముడూ అంటూ పురాణాలు వినటం ఔట్ ఆఫ్ ఫేషన్ అండీ! రాముణ్ణీ, సీతనీ, చేతనయితే ఆంజనేయుల్నీ (అది కాస్త భయమనుకోండి) వీళ్ళందరినీ నోటికొచ్చినట్లు తిట్టాలి! అదే స్టైయిల్" అంది.... బుచ్చేమ్మగారు నివ్వెరపోతూ "రాముణ్ణి తిట్టటమా? అపచారం కాదుటండీ!" అన్నారు లెంపలేసుకుంటూ.

"ఫరవాలేదు లెద్దురూ! అంతగా అయితే ప్రాయశ్చిత్తం చేసుకోవచ్చు రహస్యంగా. మీకా ప్రాయశ్చిత్త కాండ తెలియదూ?"

"తెలుసు-తెలుసు!"

"అయితే బాధలేదు! అర్థంఉన్నా లేకపోయినా, మనకు విషయం తెలిసినా తెలియకపోయినా, లేటెస్టు ఫేషన్ ఫాలో అవవలసిందేనండీ!"

"చిత్తం-చిత్తం!"

"అయినా మీకీ పాతకాల్లపు పురాణాలు చెప్తే ఏం గిట్టుబాటవు తుందండీ?"

"ఏదో అంతంతమాత్రం! ఏం చేస్తాం?"

"కాస్త అక్షరజ్ఞానం ఉన్నవారు కదా! పోనీ నవలలు వ్రాయకూడదూ? వాటికి మంచి మార్కెట్ ఉందని వున్నాను!"

"నేను నవలలు వ్రాయటమా?"



"ఏం ఎందుకు వ్రాయకూడదూ! మా వంటమనిషి వ్రాస్తుంది తెలుసా? కొంచెం రోజుల్లో పేరొచ్చి నా దగ్గర పని మానేస్తుందేమో నని భయంగా కూడా వుంది."

బుచ్చెమ్మగారికీఆలోచన బాగా నచ్చింది. వెంటనే రాత్రింబవళ్ళు కూచుని మూడువందల పేజీల మహా గ్రంథం వ్రాసేసింది. పత్రికకు పంపింది. ఆరునెలల్లో అది తిరిగొచ్చింది. అన్ని పత్రికాఫీసులనుండి తిరిగొచ్చింది. బుచ్చెమ్మగారికి మండిపోయింది. మంట

మనసులో అణచుకొనే ప్రకృతి కాదామెది. అంచేత అప్పటికే ప్రఖ్యాతులైన రచయిత్రులను విమర్శిస్తూ వ్యాసాలు వ్రాసి పంపింది. తర్కాలకూ, వివాదాలకూ చోటిచ్చి పత్రిక ప్రచారం పెంచుకోవాలనుకునే పత్రికలు కొన్ని ఆ వ్యాసాలు ప్రచురించాయి. ఆ రకంగా నవలా రచయిత్రిగా పేరు తెచ్చుకోకపోయినా, విమర్శకురాలిగా పేరు తెచ్చుకొంది. ఆవిడ ఎటువంటి రచనలనయినా ఘాటుగా విమర్శించ గలదు. వాస్తవి దృక్పథంతో బీదవారి కష్టగాధలు వ్రాస్తే "రచన చాలా చప్పగావుంది!" అంటుంది. కమ్మని కల్పనతో వ్రాస్తే "అన్నీ గాలిలో తేలిపోయే అభూత కల్పనలు" అంటుంది. ఏది వ్రాసినా,ఎలా వ్రాసినా ఆ రచనను కెలికి కెలికి ఎలాగో లోపాలు వెలికి తీసి,వాటిని వ్యంగ్యధోరణిలో వెటకారంగా విమర్శిస్తూ పాఠకులను నవ్వించటంలో ఆవిడ మంచి ప్రావీణ్యం సంపాదించుకుంది. "విమర్శల పిశాచి" అని బిరుదుకూడా పొందింది.

మంచి వాగ్ధాటి ఉన్న మనిషికనుక సభావేదికలమీద నిలిచి ఉదాత్తానుదాత్తాది స్వరభేదాలతో వెటకారాలు గుమ్మరిస్తోంటే, జనం విరగబడి నవ్వేవారు. అక్కడితో ఆవిడ ఉపన్యాసాలు బాగున్నట్లు భాసించసాగాయి. ఎలాంటి రచనలోనయినా, నెరుసులు ఏరి, వేళాకోళాలతో వ్యాఖ్యానించి జనాన్ని నవ్వించటం ఆవిడ బాగా నేర్చుకుంది.

ఒకసారి యిలాగే సభావేదికమీద ఎవరిదో నవలను వేళాకోళాలతో, వెటకారాలతో విమర్శిస్తూ జనాన్ని నవ్విస్తోంటే, సభలో వున్న సుమిత్ర సహించలేకపోయింది. బుచ్చెమ్మగారి ఉపన్యాసం పూర్తయిపోయేక తను లేచి వేదికమీదకు వచ్చి "ఏ విషయాన్నయినా, నిర్మాణాత్మకంగా పరిశీలించి వివరించడం కష్టం. వెక్కిరించి వేళాకోళాలు చెయ్యడం తేలిక. ఒక చిన్న కథ వ్రాయడం ఎంత కష్టమో, వరసగా తమ కథలు తిరిగొస్తున్న వాళ్ళందరకూ బాగా తెలుసు. వీళ్ళంతా ఇతరుల రచనలు ఘాటుగా విమర్శించటానికి తయారవుతారు! రచ

నలు చెయ్యలేని వాళ్ళు విమర్శనలను చెయ్యకూడదని
కాదు—ఆ చేసే విమర్శ సహేతుకంగా ఉండాలని!
వశాత్తూ ఈ నాడు మన విమర్శకులకు ప్రత్యేకమైన అర్హతలేవీ
సరంలేదు. ఎవరైనా, దేనినైనా విమర్శించి పారెయ్యొచ్చు—అర్థం
అయిన, కాకపోయినా. రాతివిగ్రహాలలోనూ, మట్టి బొమ్మలలోనూ
లోపాలుండక మూసిపోసినట్లుండవచ్చును! కానీ, సజీవమైన సృష్టిలో
మెరుపులు విరజిమ్మే అందాలలో దోబూచులాడుతూ లోపాలేవో
కనిపిస్తూనే ఉంటాయి. ఒక రచనలో లోపాలు ఉన్నాయా, లేదా,
అనేదానిపై దాని విలువ ఆధారపడి ఉండదు. ఆ రచనలో ఉన్న
సాహితీ విలువలే దాని నైపుణ్యానికి గీటురాయి. అల్లరి, వెటకారా
లతో—జనాన్ని నవ్వించటం తేలిక! సునిశితమైన విషయపరిశీలనతో
ఆలోచింపచెయ్యడం కష్టం!" అని మాట్లాడింది. జనంలో కరతాళ
ధ్వనులు మార్మోగాయి—బుచ్చెమ్మ గారికి మండిపోయింది.

"గుడ్డొచ్చి పిల్లను వెక్కిరించినట్లు నా విమర్శ సరిగ్గా లేదంటావా? చాల్లే, ఊరుకో!" అంది ఈసడిస్తున్నట్లు.

సుమిత్ర ఏ మాత్రం తగ్గలేదు-

"బుచ్చెమ్మగారూ! విమర్శమాట ఎలావున్నా, ముందు మీరు కాస్త సంస్కారమూ, సభ్యతా నేర్చుకోండి! సభా వేదికమీద సాటి వ్యక్తితో ఎలా మాట్లాడాలో కూడా తెలియని మీరు విమర్శలేం చేస్తారండీ!" అంది ఆవిడ ఈసడింపును మించి ధిక్కరిస్తూ.

బుచ్చెమ్మ రెచ్చిపోయి, తన చివరి ఆయుధం ప్రయోగించింది.

"ఎవరితో మాట్లాడుతున్నావో తెలుసా? నీ సంగతి రాజా వారితో చెప్పానంటే, నిన్ను శంకరగిరి మాన్యాలకు పంపించ గలరు!"

పకాలున నవ్వింది సుమిత్ర.

రవాలేదు! ఆ శంకరగిరి మాన్యాలనే సస్యశ్యామలం
ంను నేను! ఇంతకూ, వాటి అడ్రస్ తెలుసా మీకు?"

"వాటి అడ్రస్ తెలియదు. కాని, నీ అడ్రస్ తెలుసుకుంటాను. నీ భరతం పడతాను."

"నువ్వంత శ్రమ పడక్కర్లేదు. కూపస్థ మండూకంలా ఉన్న నీకు తెలియదేమో కాని, డాక్టర్ సుమిత్రను తెలియని వారెవరూలేరు."

"డాక్టర్ సుమిత్ర! అంటే. నువ్వు వైద్యం చేస్తావా?"

"ఆ డాక్టర్నికాను—నేను M. A. Ph. D.ని."

"ఓహో! అంటే పుస్తకాల డాక్టరు వన్నమాట!"

"చేతి కందిన పుస్తకాలకు ఆపరేషనులు చేసి తమ రచనలకు ప్లాస్టిక్ సర్జరీలు చేసుకునే మీలాంటి పుస్తకాల డాక్టర్లుకూడా ఉంటారేమోకానీ, అసలు పుస్తకాల డాక్టర్లంటూ ఎవరూ ఉండరు! 'డాక్టరాఫ్ ఫిలాసఫీ' అంటే ఒక విషయం యొక్క మూల తత్వాన్ని పరిశోధించి విశ్లేషణాత్మకంగా తెలుసుకొన్నవాడు—అని! ఈ మాత్రం కూడా తెలియకుండా వేదికలెక్కి దుస్సాహసంతో ఇతరులను అవమానించడానికి పూనుకొన్నావా?"

"అ(-అ(! ఎన్నెన్ని మాటలు?ఉండు-రాజావారితో చెప్పి...."

"చెప్పు! నేనూ అక్కడే వుంటాను."

"నువ్వూ అక్కడే వుంటావా? రాణీవారు తమ వంట మనిషి కూడా రచనలు చేస్తోందని చెప్పారు. నువ్వు ఆ వంటమనిషివా?"

సుమిత్ర నవ్వింది.

"వంటమనిషినే కావచ్చు. అయితే అంత చులకన దేనికి? హోటల్‌లో సర్వరుగా ఉన్న వ్యక్తి అద్భుతమైన నవలలు వ్రాసాడని వినలేదా నువ్వు? ఐశ్వర్యంతో, పలుకుబడితో, కొనలేనిది

లోకంలో ఒకటి వుంది—అదే ప్రతిభ! రూప లావణ్యాలతో,ఐశ్వర్య విలాసాలతో, ఏమాత్రం నిమిత్తం లేకుండా ప్రతిభావంతులను లోకం సన్మానిస్తుంది! అది తెలుసుకో!"

"తెలుసుకుంటాను-తెలుసుకుంటాను. నీకూ తెలియ చెపుతాను!" పటపట పళ్ళు నూరుకొంది బుచ్చెమ్మగారు.

ఆ మరునాడే రాజావారితో చెప్పింది బుచ్చెమ్మగారు- "డాక్టర్ సుమిత్ర అనే దుర్మార్గురాలు నన్ను అవమానించిందండీ! మీరుగట్టిగా బుద్ధి చెప్పాలి!" అని. రాజావారు తెల్లబోయి "సుమిత్రా!" అని పిలిచారు. లోపలి గదిలోనుండి "పిలిచారా నాన్నగారూ?" అంటూ వచ్చింది సుమిత్ర.



ఆ సంబోధన వింటూనే పై ప్రాణాలు పైన పోయాయి బుచ్చెమ్మగారికి. గొంతు తడారిపోతుండగా "ఈమె....ఈమెగారు.... చిన్న రాణీగారు—మీ కుమార్తెగారా!" అంది.

"నన్ను చిన్నరాణీ అనక్కర్లేదు. నేను రాణిని కాను. మీలా నేను నాకు పలుకుబడి ఉందని చాటుకోను. నాకు ఆధారం

నా ప్రతిభ! నా ఆయుధం నా నిజాయితీ!"

"మీరు .... తమరు .... అతి మామూలుగా ఉండేను.... అంచేత...."

"అవును! అహంకారాలకూ, ఆడంబరాలకూ పోని సాత్వికు రాలినే నేను! కాని దురంహకారాన్ని ప్రదర్శిస్తే మాత్రం సహించి ఊరుకోను. తీవ్రంగా ప్రతిఘటిస్తాను, తగిన విధంగా బుద్ధి చెపుతాను."

అంతవరకూ వినోదంగా ఈ సంభాషణ వింటోన్న రాజా వారు కల్పించుకొని "ఎందుకమ్మా! ఈవిడని అవమానించావట?" అన్నారు.

"అవమానించ లేదు నాన్నగారూ! సమగ్ర పరిశీలన చెయ్యటానికి మారుగా రచయిత్రిగా పేరు తెచ్చుకోలేక పోయాననే అక్కసుతో అందరి రచనలనూ దుమ్మెత్తిపోస్తోంటే సహించలేక ఎదుర్కొన్నాను. అంతే!"

"విమర్శ అంటే సమగ్ర పరిశీలనా? దుమ్మెత్తి పొయ్యటం కాదూ?" అని బిత్తరపోయింది బుచ్చెమ్మగారు. ***

